# ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడి

◆ జిల్లాలో ఉధృతంగా అంగన్‌వాడీల సమ్మె
◆ అన్ని నియోజకవర్గాల్లోనూ నిరసన ర్యాలీలు
◆ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్
◆ ప్రభుత్వం స్పందించేంత వరకూ పోరాటం

**అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె మరింత ఉధృతం అయ్యింది. వేతనాల పెంపుదల, గ్రాట్యూటీ అమలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సాధన కోసం చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఆందోళనల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేల నివాసాలు, కార్యాలయాలను బుధవారం నాడు ముట్టడించారు. పోలీసులు అడ్డుకున్నా వారిని ఎదిరించి ఎమ్మెల్యేల నివాసాల వద్ద నిరసన తెలిపారు.**

**ప్రజాశక్తి-జిల్లా యంత్రాంగం**

◆ **అనంతపురం అర్బన్** నియోజకవర్గం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. కృష్ణకళామందిరం నుంచి అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు ర్యాలీగా కోర్టు రోడ్డు మీదుగా ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. ఆయన ఇంటి వద్ద బైటాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వీరిని అడ్డుకునేందుకు యత్నించడంతో అంగన్‌వాడీలు ప్రతిఘటించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వారికి వద్దకొచ్చి సమస్యలను విన్నారు. కార్మికుల పోరాట మార్గాన్ని తాను గౌరవిస్తానని అంగన్‌వాడీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. అంగన్‌వాడీల ఆందోళనలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే దృష్టికి అంగన్‌వాడీల సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారని ఆ మేరకు వాటిని అమలు చేయాలని గేయానంద్ కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణతో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

◆ **కళ్యాణదుర్గంలో** మంత్రి ఉషశ్రీచరణ్ ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మంత్రి నివాసం వరకు ర్యాలీగా వెళ్లారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులు అంగన్‌వాడీలు, సిఐటియు నాయకుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. తమ సమస్యలను వినే ఓపిక కూడా ప్రజాప్రతినిధులకు లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు శకుంతలతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

◆ **రాప్తాడు** ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. అనంతపురంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డువద్ద ఉన్న ఆయన కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో పీఏకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, సిఐటియు జిల్లా నాయకులు మన్నీల రామాంజినేయులు, శ్రీసత్యసాయి జిల్లా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి లింగన్నతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **శింగనమల** ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నివాసాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. అనంతపురంలోని జన్మభూమి రోడ్డులో ఉన్న ఆమె నివాసాన్ని పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు ముట్టడించారు. ఎమ్మెల్యే సమస్యలను వినేందుకు బయటకు రాకపోవడంతో అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడే రోడ్డుపై బైటాయించి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **తాడిపత్రిలో** ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు నాయకులు జగన్ మహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి తదితరులు వీరికి మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డికి వినతి పత్రాన్ని అందజేసేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీలు ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్తున్న నేపథ్యంలో సిఐ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అక్కడ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. దీనిపై అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. తమ సమస్యలను పరిష్కరించమంటే ఇలా నిర్బంధాలు విధించడం ఏమిటంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

◆ **రాయదుర్గంలో** శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నివాసం వద్ద అంగన్‌వాడీలు గంటకు పైగా ధర్నా చేపట్టారు. ముందుగా పట్టణంలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీ చేపట్టారు. ఆర్అండ్ బి అతిథి గహం నుంచి కనేకల్ రోడ్డు మీదుగా ఎమ్మెల్యే ఇంటి వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ బైటాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే పీఏకు అందజేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాల రంగయ్య, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, సిపిఎం సీనియర్ నాయకులు నాగరాజు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

◆ **గుంతకల్లు** పట్టణంలో ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి నివాసాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. దీక్షా శిబిరం నుంచి అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్తుండగా అప్పటికే పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. సిఐటియు నాయకులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పోలీసులతో వాగ్వాదం చేశారు. ఎమ్మెల్యే ఇంటి వద్దనే రోడ్డుపై బైటాయించారు. ఎమ్మెల్యేకు సమస్యను చెబుతామని శాంతి యుతంగా వెళ్తున్న తమను అడ్డుకోవడం సరికాదంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కూతురు, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అంగన్‌వాడీల వద్దకు వచ్చి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్, తిమ్మప్ప, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

◆ **ఉరవకొండలోని** టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పార్టీ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు ముట్టడించారు. ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ సర్కిల్ నుంచి టిడిపి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ ఎమ్మెల్యే లేకపోవడంలో టిడిపి నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇక వజ్రకరూరు మండలంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని ఆయన స్వగ్రామం కొనకొండ్లలో అంగన్‌వాడీలు కలిసి వినతిపత్రం అందజేశారు.

కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఇంటి వద్ద అంగన్‌వాడీల ఆందోళన

అనంతపురంలో ఎమ్మెల్యే అనంత ఇంటి వద్ద బైటాయించిన అంగన్‌వాడీలు

గుంతకల్లులో ఎమ్మెల్యే ఇంటి వద్దకు ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలు

రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాపు ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

శింగనమల ఎమ్మెల్యే ఇంటి వద్ద సహపంక్తి భోజనాలు చేస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

ఉరవకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

రాప్తాడు ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె దీక్షల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

# పోరు ఆగదు..!

◆ ప్రభుత్వం తక్షణం స్పందించాలి
◆ మోకాళ్లపై నిలబడి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన
◆ 8వ రోజు కొనసాగిన సమ్మె

సమగ్రశిక్షా సమ్మె 8వ రోజు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెపోరాటం ఆగదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు స్పష్టం చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. జేఏసీ ఛైర్మన్ కె.విజయ్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు మాజీ ఎమ్మెల్సీ, ఎస్-ఎస్ఏ ఉద్యోగులు జేఏసి గౌరవాధ్యక్షులు డాక్టర్ గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పుడు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ ఛైర్మన్ విజయ్ మాట్లాడుతూ న్యాయమైన హక్కుల కోసం ఉద్యోగులు సమ్మె చేపడుతుంటే ఎస్ఎస్ఏ పీవో బెదిరింపు ధోరణితో ఉద్యోగుల పట్ల వ్యవహరించడం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు పోరాటం ఆగదన్నారు.

# అనంత బాలోత్సవాలను జయప్రదం చేద్దాం : డిఇఒ


బాలోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ నాగరాజు తదితరులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్న పిల్లల పండుగ 'అనంత బాలోత్సవం-4'ను జయప్రదం చేద్దామని జిల్లా విద్యాశాఖాధికారి వి.నాగరాజు పిలుపునిచ్చారు. అనంత బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన అనంత బాలోత్సవం బ్రోచర్‌లను డిఇఒ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలు, పాటలు, సైన్స్ ఆవిష్కరణలు, కళానైపుణ్యాభివృద్ధికి దోహదపడేలా అనంత బాలోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. సృజనాత్మకత, సాంస్కృతిక కళ, దేశభక్తి గేయాలు, నాటికలు తదితర ఈవెంట్‌లతో మూడు రోజుల పాటు అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో బాలోత్సవం జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొని బాలోత్సవం-4ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనాథ్, ఆదినారాయణ, యుటిఎఫ్ సీనియర్ నాయకులు, అనంత బాలోత్సవ కమిటీ కోశాధికారి మహమ్మద్ జిలాన్, కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.సావిత్రి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, కమిటి సభ్యులు సురేష్, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సూర్యుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్ ముందు జెసిపిఆర్ నిరసన

## అడ్డుకున్న పోలీసులు

జెసి.ప్రభాకర్‌రెడ్డిని బలవంతంగా ఆయన ఇంటికి తీసుకెళ్తున్న పోలీసులు

**ప్రజాశక్తి-తాడిపత్రి**

పట్టణ పోలీసుల తీరును నిరసిస్తూ బుధవారం మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ముందు చేపట్టనున్న నిరసనను పోలీసులు అడ్డుకున్నారు. వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా తాడిపత్రి పట్టణంలో మున్సిపల్ విద్యుత్ దీపాలకు అడ్డంగా ఉన్న వైసిపి జెండాలను తొలగిస్తున్న సందర్భంలో పోలీసులు కలుగజేసుకొని ఒక రోజు గడువు తర్వాత తొలగిస్తామన్నారు. రెండు రోజులైనా వైసిపి జెండాలను తొలగించకపోవడంతో బుధవారం జెసి పట్టణ పోలీస్ స్టేషన్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టగా పోలీసులు అడ్డుకుని వాహనం ఎక్కించే సందర్భంలో తోపులాట జరిగింది. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ జెసి రోడ్డుపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. అయినా జెసిని బలవంతంగా పోలీసు వాహనం ఎక్కించి ఇంటికి తరలించే ప్రయత్నం చేయగా ఆయన మార్గమధ్యలో తన వాహనంలోకి వెళ్లిపోయారు.

# రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి రీసర్వే ప్రక్రియపై డిఆర్‌వోలు, ఆర్డీవోలు, సర్వే ఎడి, తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫేజ్-3లో భాగంగా జిల్లాలో 115 గ్రామాలలో రీసర్వే ప్రక్రియను చేపట్టగా, అందులో ఇప్పటివరకు 94 గ్రామాల్లో గ్రౌండ్ టూ థింగ్, గ్రౌండ్ వ్యాలుడేషన్ పూర్తి చేసి డిఎల్‌ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్) పూర్తి అయ్యిందన్నారు. పూర్తయిన గ్రామాల్లో భూహక్కుపత్రాలు పంపిణీ, రాళ్ల ఏర్పాటు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌వో గాయత్రీ దేవి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ బాలాజీ, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లానాయక్, రీసర్వే తహశీల్దార్ మారుతి పాల్గొన్నారు.

# సెస్ బకాయిలు చెల్లించాలి

## కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**అనంతపురం కలెక్టరేట్ :** జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో గ్రంథాలయ సంస్థ సిబ్బంది తదితరులు కలిసి బకాయి పత్రాన్ని అందజేశారు. కళ్యాణదుర్గం మున్సిపల్ పరిధిలో 2011-12 నుంచి 2015-16 వరకు రూ.14,28,407, 2016-17 నుంచి 2022-23 వరకు రూ.69,14,266 లక్షలు మొత్తం రూ.83,42,672 లక్షల సెస్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గ్రంథాలయాలు సెస్‌లపై ఆధారపడి నిర్వహణ సాగుతోందన్నారు. తక్షణమే సెస్ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర మహాసభలు కాకినాడలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం నాడు ప్రారంభం అయ్యాయి. ఈ మహాసభల్లో అనంతపురం జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టిన విద్యార్థి, విద్యారంగ సమస్యలపై పోరాటాలను మహాసభల గ్రూపు చర్చల్లో చర్చించారు.

రాష్ట్ర మహాసభల చర్చల్లో పాల్గొన్న సత్యసాయి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు

# అనంతలో కరోనా కలకలం

## రెండు పాజిటివ్ కేసులు నమోదు

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురంలో మళ్లీ కరోనా కలకలం రేగింది. నగరానికి చెందిన ఇద్దరికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇద్దరికి కరోనా సోకిందని తెలియడంతో అందరిలో ఆందోళన నెలకొంది. అనంతపురంలో ఒకే రోజు రెండు పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ప్రజల్లో మళ్లీ కరోనా భయం పట్టుకుంది. అందరూ అప్రమత్తంగా ఉండాలని, విధిగా మాస్క్ లు ధరించాలని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. పెద్దఆస్పత్రిలో కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు.

# 'రాజకీయ చీడను ఏరివేస్తా'..

## ఎమ్మెల్యే పెద్దారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

తాడిపత్రి నియోజకవర్గంలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తుంటే కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఇలాంటి రాజకీయ చీడను 2024 ఎన్నికల తరువాత ఏరిపారేస్తానంటూ తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై అబాండాలు వేస్తున్న వ్యక్తులను ఎన్నికల తర్వాత నా ప్రత్యర్థులను వదిలే ప్రసక్తి లేదన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన వదిలేది లేదన్నారు. కొందరు కావాలనే తనపై కరపత్రాలు వేసి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల తర్వాత నాలో పాత పెద్దారెడ్డిని చూపిస్తానని చెప్పారు. తన ఆవేశం ప్రజల మీద కాదని కేవలం బురదజల్లే రాజకీయాలు చేస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై మాత్రమే అన్నారు. పంటకు చీడపురుగు ఎంత ప్రమాదమో రాజకీయాల్లో కూడా చీడ పురుగు అంతే ప్రమాదమన్నారు. అలాంటి చీడను కచ్చితంగా ఏరి వేస్తానన్నారు. తాను సంపాదించిన ప్రతి ఒక్కటీ సక్రమమేనని పెద్దారెడ్డి స్పష్టం చేశారు. తాడిపత్రిలో జెండాల తొలగింపుపై జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆందోళన చేయడం హాస్యాస్పదం అన్నారు. బినామీ పేర్లతో తాడిపత్రి మున్సిపల్ ఆస్తులను జేసీ కొల్లగొట్టారని, ఆయన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం అన్నారు.

# ఈవీఎం గోడౌన్ల తనిఖీ

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఉన్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను పరిశీలించారు. అందరి సమక్షంలో ఆయా ఈవీఎం గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, భద్రతా చర్యలను పరిశీలన చేశారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఆమె వెంట ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ భాస్కర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

# పొగడ్తలే కానీ శ్రమకు తగ్గ ఫలితం లేదు

## కార్మిక సంఘం నేతల ధ్వజం

## మోకాళ్లపై నిల్చొని మున్సిపల్ కార్మికుల నిరసన

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

కోవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించిన కార్మికులకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమంటూ పాలకులు పొగడ్తల వర్షం కురిపించారు కానీ వారి శ్రమకు తగిన ఫలితం ఇవ్వడానికి మాత్రం మనసు రావడం లేదని కార్మిక సంఘం నేతలు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులు రెండో రోజైన బుధవారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరికి కార్మిక సంఘ నేతలతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రమ్మ, సిపిఎం న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి. నాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, తదితర మద్దతు తెలిపారు. వారు మాట్లాడు తూ సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ. 26వేలు, పెండింగ్ వేతనాలు, క్లబ్ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం, తదితర డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపాలని, లేనిచో నగర, పట్టణాల్లో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల న్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సెక్షన్ నగర కోశాధికారి పోతలయ్య, లోకేష్ నాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు నల్లప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఏరుస్వామి, సాకే తిరుమలేష్, శ్రామిక మహిళా కన్వీనర్ లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, జిల్లా కోశాధికారి ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, రాజేశ్వరి, పాల్గొన్నారు.

**చెత్త తరలింపును అడ్డుకున్న సిఐటియు నేతలు**

నగరంలోని పాతూరు కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న చెత్తను శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు ప్రయివేట్ వ్యక్తులు, యంత్రాలతో తరలించే ప్రయత్నాలను సిఐటియు నేతలు ఎర్రి స్వామి, తిరుమలేశు అడ్డుకున్నారు. ట్రాక్టర్‌లోకి ఎత్తిన చెత్తను అక్కడే డంపింగ్ చేయించారు. మున్సిపల్ కార్మికుల సమ్మెను నిర్వీర్యం చేయటానికి అధికారులు ప్రయత్నించటం తగదన్నారు.

**టిడిపి, సిపిఎం, సిఐటియు మద్దతు**

**అనంతపురం :** మున్సిపల్ కార్మికుల సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మి నరసింహులు, నగర అధ్యక్షుడు పూల బాషా, సిపిఎం జిల్లా నాయకురాలు సావిత్రి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, టైలర్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాలు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు మంజుల నారాయణ, సుధాకర్, నవీన్ మద్దతు తెలిపారు. మున్సిపల్ కార్మికుల పట్ల వైసిపి ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు.

గుంతకల్లులో దీక్షలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

**తాడిపత్రి :** ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం నుంచి పెద్దఎత్తున ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరకుని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిపిఐ నాయకులు రంగయ్య సంఘీభావం ప్రకటించారు.

**గుంతకల్లు :** ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు కె.నరసయ్య నాయకత్వంలో కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం ఎదుట రోడ్డుపై ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిపిఎం, ఆవాజ్ కమిటీ, ప్రజా సంఘాలు సంఘీభావం తెలిపాయి. దీక్షలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, తిమ్మప్ప, సిఐటియు పట్టణ, అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, ఆవాజ్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్దుల్లా, షాషావలి, నాయకులు షబ్బీర్, మస్తాన్, ఖాదర్‌బాషా, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి :** ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుత్తిలో మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం, జిల్లా నాయకులు ఓబుళపతి, నాగేంద్ర, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున మద్దతు తెలిపి శిబిరంలో బైఠాయించారు. కె.నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని,

అనంతపురంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

లేనిచో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్, కరిడికొండ సుధాకర్ నాయుడు, గోరంట్ల నాగరాజు సంఘీభావం తెలిపారు. దీక్షలో కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శు లు ఎన్.రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, కోశాధికారి బాల రంగన్న, నాయకులు ఈశ్వరయ్య, ఎస్.రాజా, కార్యదర్శి రవిశంకర్, మురళి, నరసింహ, శేఖర్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు : సిపిఎం

**అనంతపురం కలెక్టరేట్ :** సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ రద్దు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పూర్తియినా ఇందులో ఏ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. 2023, జూన్ 10వ తేదీన ప్రిన్సిపల్ సెక్రటరీ మంత్రివర్గ కమిటీ మున్సిపల్ కార్మిక సంఘాలతో చర్చించి ఆమోదించిన హామీలు కూడా అమలు చేయకపోవడం అన్యాయంగా ఉందన్నారు. 2022లో 5 రోజులు కార్మికుల సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులకు 30 జీవో సవరించి వాటర్ సెక్షన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితర కేటగిరిలకు కార్మిక శాఖ ప్రతిపాదించిన వేతనాలు చెల్లిస్తామని చెప్పి, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్‌లకు రూ.18,500 కనీస వేతనం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు.

అనంతపురం పూతూరు మార్కెట్ వద్ద చెత్త తరలింపును అడ్డుకుంటున్న సిఐటియు నాయకులు

అనంతపురం : మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు

తాడిపత్రిలో మున్సిపల్ కార్మికుల ర్యాలీ

గుత్తిలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-గుత్తి**

మండల పరిధిలోని వన్నెదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాచుపల్లి గ్రామానికి చెందిన రంగస్వామి, శ్రీలక్ష్మి దంపతులు రెండేళ్ల కుమారుడు రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గుత్తికి బయల్దేరారు. మార్గమధ్యలో వన్నెదొడ్డి గ్రామం వద్ద అదుపుతప్పి కిందపడంతో శ్రీలక్ష్మి, రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ప్రమాదంలో గాయపడిన బోయ హనుమంతు

**బెళుగుప్ప :** మండల పరిధిలోని గుండ్లపల్లి క్రాస్ సమీపంలో బుధవారం ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నంచి బొలెరో ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. రాయదుర్గం మండలం కంచానుపల్లికి చెందిన బోయ హనుమంతు టివిఎస్ ఎక్స్‌ఎల్‌పై గుండ్లపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా కళ్యాణదుర్గం వైపు నుంచి వస్తున్న బొలెరో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతా మన్నారు.

### మాజీ సైనికుడి మృతికి సంతాపం

**ప్రజాశక్తి-అనంతపురం**

మాజీ సైనికుడు ఇ.వెంకటరమణ(90) హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సైన్యంలో 20 ఏళ్లు సేవలందించి 1973లో రిటైర్డ్ అయ్యారు. ఆ తర్వాత దేవాదాయ శాఖలో సేవలందించారు. 1962 చైనా యుద్ధం, 1965, 1971 పాకిస్థాన్ యుద్ధంలో పాల్గొన్నారు. నగరంలోని జీసస్ నగర్‌లో ఉన్న స్వగృహంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మాజీ సైనికులు వెంకట రమణ పార్థివ దేహానికి జాతీయ జెండా కప్పి వందనం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ డి.శేకన్న, రంగారెడ్డి, జగన్మోహన్‌నాయుడు, అబ్దుల్ ఖాదర్, రఘునాథ రెడ్డి, రమణ, ప్రభుదాస్, అల్లాబకాష్, నాగిరెడ్డి, మహబూబ్‌పీరా, నాగరాజు, రవి కుమార్, ప్రసాద్, ఖాజామొయిద్దీన్, ఇస్మాయిల్, షఫీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటరమణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

## ఎపిఐఐసి చైర్మన్‌గా 'మెట్టు' పదవీకాలం పొడిగింపు

మెట్టు గోవిందరెడ్డి

**రాయదుర్గం :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఎపిఐఐసి) ఛైర్మన్‌గా మెట్టు గోవిందరెడ్డి పదవీ కాలాన్ని మరో రెండేళ్లు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు పరిశ్రమల శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మెట్టు తెలిపారు. తనకు మరోసారి అవకాశం కల్పించినందుకు సిఎం జగన్‌కి మెట్టు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## కదిరిదేవరపల్లి రైలు పాక్షిక రద్దు గడువు పొడిగింపు

**రాయదుర్గం :** కదిరిదేవరపల్లి, సిద్ధాపూర్ స్టేషన్ల వద్ద రైలు మార్గం నిర్మాణ పనుల దృష్ట్యా కదిరిదేవరపల్లి-తిరుపతి రైలు(07589/07590) పాక్షిక రద్దు గడువును మరో నెల రోజుల పాటు పొడిగించినట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ మంజునాథ్ కనమడి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకూ ఈ రైలు గుంతకల్లు-కదిరిదేవర పల్లి మధ్య నడవదని, గుంతకల్లు-తిరుపతి నడుమ మాత్రమే ప్రయాణిస్తుందన్నారు.

## దుర్గంలో వైద్య శిబిరం

**నార్పల :** మండల పరిధిలోని సిద్ధరాచెర్ల గ్రామపంచాయతీ దుర్గం గ్రామంలోని ఆర్‌డిటి స్కూల్ లో బుధవారం పప్పూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గర్భిణులు, ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి సూచనలు చేశారు. శిబిరంలో సర్పంచి సాకే రామాంజనేయులు, వైద్య సిబ్బంది అమృతాంజలి, ఎఎన్‌ఎం ఫరీదాబాను, వీరనారాయణమ్మ, పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

**అనంతపురం :** నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు, ప్రవాస భారతీయులు శ్రీనివాసులు, ధనలక్ష్మి దంపతులు వారి కుమారుడు గోకుల్ పుట్టినరోజు సందర్భంగా 300 మందికి అన్నదానం చేశారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్రమణ్యం, సుబ్బారావు, కిష్టప్ప, సౌధామణి, వాణిశ్రీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలో గెలుపొందిన పెద్దమట్లగొంది జట్టు సభ్యులు

## క్రికెట్ పోటీలో పెద్దమట్లగొంది జట్టు విజయం

**శింగనమల :** ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోపి చిన్నమట్లగొంది గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలో పెద్దమట్లగొంది గ్రామం జట్టు విజయం సాధించింది. పెద్దమట్లగొంది జట్టు 10 ఓవర్లకు 96 పరుగులు చేయగా ఓపెనర్ బ్యాట్స్‌మెన్ చంద్ర 35 బంతుల్లో 54 పరుగులు చేశాడు. చిన్నమట్లగొంది 53 పరుగులు చేసి ఓడిపోయింది. టి.ఓబిలేసు 4 వికెట్లు తీశాడు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మద, పిడి భయపరెడ్డి, హర్షవర్ధన్, బాషా, విలేజ్ కార్యదర్శి శ్రీనాథ్, వాలంటీర్ సురేంద్ర, ముత్యాలు, ఆదినారాయణరెడ్డి, కడిమి నారాయణస్వామి, అమర్నాథ్, మదన్మోహన్, ధనుంజయ, యోగి, శశిధర్‌రెడ్డి, సుమంత్, బిల్లా కిరణ్, రామ్‌చరణ్‌తేజ పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగుతో అధిక దిగుబడి

**బుక్కరాయసముద్రం :** ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారి బి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రోటరీపురం, జంతలూరు, కొట్టాలపల్లి గ్రామాల్లో సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం కింద మొదటి సంవత్సరం రాయితీ కోసం నమోదు చేసుకున్న దానిమ్మ, అరటి, పందిరి ద్వారా సాగు చేస్తున్న ద్రాక్ష తోటలను బుధవారం ఆయన ఉద్యాన సహాయ సంచాలకులు బివి.నరసింహారావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దానిమ్మ, అరటి పంటల్లో ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, సాగు విధానాల గురించి రైతులకు వివరించారు. ఆయన వెంట మండల ఉద్యాన అధికారి ఎం.శైలజ, ఆర్‌బికె ఉద్యోగులు నేత్ర, జగన్, రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

## 'కుష్టు'ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

**ప్రజాశక్తి-అనంతపురం**

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే నయమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా . ఈబి.దేవి తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకూ చేపట్టనున్న కుష్టు వ్యాధి సర్వేను బుధవారం నగరంలోని ఇందిరానగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ప్రారంభించారు. సర్వేపై క్షేత్ర స్థాయి సిబ్బంది, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. అన్ని ప్రభుత్వ ఆసుప త్రుల్లో కుష్టు నివారణ మందులు అందుబాటులో వుంచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారి డా. అనుపమ జేమ్స్, డా. గంగాధర్‌రెడ్డి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా. రోహిత్‌నాయుడు, పిఎంఒ నాగన్న, డిపిఎంఒ సూర్యప్రకాష్‌రెడ్డి, హెచ్‌ఇఒ సత్యనారాయణ, పాల్గొన్నారు.

**బెళుగుప్ప :** స్థానిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుష్టు వ్యాధి నివారణపై వైద్య సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుష్టువ్యాధిపై పోస్టర్లు విడుదల చేశారు. అలాగే కుష్టు వ్యాధి నివారణపై ర్యాలీ చేపట్టారు. డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, సూపర్వైజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, సరోజ, ఎఎన్‌ఎంలు అనసూయ, రాధమ్మ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డా. ఈబి దేవి

## జగన్‌ను నమ్మి మరోసారి మోసపోవద్దు : మాజీ ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పామిడి**

సిఎం జగన్ హామీలు నమ్మి మరోసారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ప్రజలకు సూచించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన యువ నాయకులు అనిల్‌గౌడ్, ధర్మతేజ్‌గౌడ్, రామ్‌తేజ్‌గౌడ్, స్థానిక టిడిపి నాయకులతో కలిసి మండల పరిధిలోని అనుంపల్లి, ఖాదర్ పేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్, మనీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి అరాచక, అసమర్థ పాలన గురించి వివరించారు. జితేంద్రగౌడ్ మాట్లాడుతూ రాబోయేది టిడిపి, జనసేన ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో పల్లె శ్రీనివాసులు, సుం కప్ప, ఎం.సుంకప్ప, లక్ష్మీదేవి, సూరి, రామాంజినేయులు, సుంకన్న, హరి, రాజు, హుస్సేనప్ప, గోపాల్ గౌడ్, వన్నూరు, సూరి, సంజీవ, చిన్న ఓబులేసు, సోమనాథ్ రెడ్డి, కన్నా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

## బకాయి వేతనాలు చెల్లించాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాలతో పాటు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సహాధ్యక్షులు రామప్ప చౌదరి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉరవకొండ డివిజన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తూ మానసిక శోభకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంజీవ్‌కుమార్, శేఖర్, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూర్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నారాయణ, జయరాములు, బండయ్య నరసింహులు, ఆంజనేయులు, చంద్రశేఖర్, జానకిరాములు, రవిచంద్ర, గిరి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

తహశీల్దార్ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

**రాయదుర్గం :** యుటిఎఫ్ రాయదుర్గం జోన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి అనంతరం తహశీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు హనుమంత్‌రెడ్డి, రవికుమార్, రాయదుర్గం, గుమ్మఘట్ట మండల శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు, సీనియర్ ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై కరపత్రాలు

**ప్రజాశక్తి-అనంతపురం**

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నగరంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై ముద్రిం చిన కరపత్రాలను ముఖ్యఅతిథి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పివి.రమణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఛైర్మన్ వి.సూరిబాబు , జిల్లా అధ్యక్షులు ముద్దుపాటి లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి టి.ప్రతాప్‌నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేష్, రంగయ్య, బాలకృష్ణ, జి.సదాశివ రెడ్డి, మద్దిలేటి, అనిత, శ్రీవాణి, డిపో, గ్యారేజీ కార్యదర్శి పి.రామాంజనేయులు, ఓబయ్య, అసోసియే షన్ సీనియర్ నాయకులు, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు డిపో మేనేజర్ సురేష్ కుమార్‌తో పాటు, అన్ని స్థాయి అధికారులు, ఉద్యోగులకు కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు జిలాన్, తిప్పేస్వామి, దూద్‌పీరా, సతీష్‌కుమార్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ సిద్దేశ్వరులు, సిసిఎస్ డెలిగేట్ నాగరాజు, బాలాజీనాయక్, చంద్రశేఖర్, షబ్బీర్‌ఖాన్, తిమ్మరాజులు, వన్నూరుస్వామి, మస్తాన్, మాలిక్‌బాషా, గంగేనాయక్, దేవేంద్రనాయక్, రామాంజనే యులు, తదితరులు పాల్గొన్నారు.

డిపో ఎదుట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

## పాత వాహనాల వేలం : డిఎంహెచ్ఒ

**ప్రజాశక్తి-అనంతపురం**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కాల పరిమితి చెందిన 12 వాహనాలను జనవరిలో ఈ వేలం పోర్టల్ ద్వారా వేలం వేయనున్నట్లు డిఎంహెచ్ఒ డా. ఈబి దేవి తెలిపారు. డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాహనాల కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వేలంకు సంబంధించిన పూర్తి నిర్ణయాధికారం డిఎంహెచ్ఒ పరిధిలో ఉంటుందన్నారు. కమిటీలో ఛైర్మన్‌గా డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, కన్వీనర్‌గా గిరిజ మనోహర్‌రావు, సర్వీస్ ఇంజినీర్ తారా మోహన్‌రావు, మోహన్‌కుమార్, సిఎస్ రఘునాథ్, రఘునాథ్‌వర్మ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

## వాననీటి కాలువల నిర్మాణానికి రూ. 20 కోట్లు : ఎమ్మెల్యే

**రాయదుర్గం :** పట్టణంలో వర్షం నీటి ముంపు బెడదను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను సిఎం జగన్‌తో పాటు ఆర్థిక, పురపాలక శాఖ మంత్రులకు చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పట్టణంలోని 11 వార్డుల పరిధిలో వాననీటి కాలువలు నిర్మిస్తామన్నారు.

## అంగన్‌వాడీల పోరాటాలకు ఐద్వా మద్దతు

**అనంతపురం కలెక్టరేట్ :** న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్మికులు చేస్తున్న పోరాటాలకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, నాయకురాలు డాక్టర్ ప్రసూన తెలిపారు. అంగన్‌వాడీల పోరాటాలకు మద్దతుగా ఐద్వా ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను బుధవారం నాడు ప్రజావైద్యశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా పోరాటాల్లో అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు. న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం 16 రోజులుగా చేస్తున్న పోరాట పటిమ ఆదర్శనీయంగా నిలిచాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నా భయపడకుండా అంగన్‌వాడీలు మొక్కవోని దీక్షతో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, పర్యాబి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

**అనంతపురం కలెక్టరేట్ :** అనంతపురం నగరం అశోక్‌నగర్ హరిహర దేవాలయం, శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప అన్నదాన సమితి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మహిళలతో జ్యోతుల ఊరేగింపును నిర్వహించారు. అశోక్ నగర్ బ్రిడ్జి, అంబేద్కర్ భవన్ మీదుగా విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి హరిహర దేవాలయం వరకు ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో హరిహరపుత్ర అయ్యప్ప అన్నదాన సమితి సభ్యులు రాజా రమేష్, ఆకుల రాఘవేంద్ర, వెంకటేష్, గురుస్వామి పాల్గొన్నారు.

**గుత్తి :** గుత్తి ఆర్‌ఎస్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో మండల పూజ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున అర్చకులు గణపతి హోమం చేశారు. అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం పడిపూజ ఘనంగా నిర్వహించారు.

## నార్పల పాఠశాలలో భారీ మర్రి చెట్టు తొలగింపు

**నార్పల :** స్థానిక పాత ప్రాథమిక పాఠశాల భవనంలో తాత్కాలికంగా తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో ఆ భవనానికి మరమ్మతులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా ఎలాంటి అడ్డు లేకున్నా భారీ మర్రి చెట్టును ప్రొక్లయిన్‌తో కూకటి వేళ్లతో సహా తొలగించడం విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి తీసుకొచ్చిన తినుబండారాలు, వాటర్ బాటిళ్లు, తదితర వాటిని గ్రౌండ్‌లో అలాగే పడేసి వెళ్లడంతో క్రీడాకారులు, విద్యార్థులు వాటిని శుభ్రం చేసుకోవాల్సి వచ్చింది.

## నాటకాల్లో మెప్పిస్తున్న ఉపాధ్యాయుడు



జిఎస్ హనుమంతప్ప

బయలాటలో అర్జునుని పాత్ర

**రాయదుర్గం :** ఓ వైపు ఉపాధ్యాయ వృత్తి మరోవైపు వివిధ నాటకల్లో పలుపాత్రాలు పోషిస్తూ పలువురి చేత ఔరా అనిపించుకుంటు న్నారు జిఎస్.హనుమంతప్ప. ఈయన డి.హీరేహాల్ జడ్పి హైస్కూల్‌లో కన్నడ భాష ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పాఠశాలలో విద్యాబోధనతో పాటు జానపద, పౌరాణిక, సామాజిక నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ అంతరించిపోతున్న బయలు నాటకాల్లో తన నటనా ప్రతిభను కనబరుస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం డి.హీరేహాల్ గ్రామంలో నీలకంఠేశ్వరుని ఉత్సవం సందర్భంగా నీలకంఠేశ్వర కృప పోషిత నాటకమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'కలియుగ శకుని' నాటకంలో 'హులిరాజు' అనే ప్రతి నాయకుడి పాత్ర పోషించి మెప్పించారు. జానపద కళల్లో భాగంగా 'బయలాట'లో అర్జునుడి పాత్రను పోషించారు. పౌరాణిక కళల్లో భాగంగా 'భూకైలాస్' నాటకం, భయలాటం విద్యార్థులకు నేర్పిస్తున్నారు.